క్లుప్తంగా

స్వరాష్ట్రంలో కులవృత్తులకు ఆదరణ



విద్యారణ్యపురి: ఉమ్మడి రాష్ట్రంలో కులవృత్తులు, చేతివృత్తుల విధ్వంసం అతి వేగంగా జరిగిందని, స్వరాష్ట్రంలో తిరిగి ఆదరణ లభించిందని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ తెలిపారు. కేయూసీ రోడ్డులో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులవృత్తులకు బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పునర్ వైభవం తీసుకొచ్చారని కొనియారు. ఆరు దశాబ్దాల ఆరాటం, పోరాటంలో శిథిలమైన తెలంగాణ పునర్నిర్మాణం గురించి తాపత్రయ పడి హరిత, నీలి, గులాబీ, శ్వేత విప్లవాలను ఆవిష్కరించిన బడుగుల ఆరాధ్యుడు కేసీఆర్ అని గుర్తుచేశారు. ఈక్రమంలో బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పాస్ నాయకులు ఆచార్య తిరుపతయ్య డాక్టర్ శివ నాగయ్య, శ్రీరాం వీరయ్య, చిన్నాల యశ్వంత్ యాదవ్, గొడిశాల సుదర్శన్ గౌడ్ అప్పని సతీష్ కుమార్, డాక్టర్ చాగంటి శ్రీనివాస్, రాము, నీలం ప్రనూఫ్, రాకేష్ పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి



ఖిలా వరంగల్: సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందిందని, ఈక్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ కోరారు. వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని ఎస్ఆర్ఆర్‌తోటలో సోమవారం జరిగిన ట్రస్ట్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకే తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో మౌలానా షఫీయొద్దీన్, మహ్మద్ మగ్దూం, దస్తగిరి, అబ్రహం, అమీర్, హాసన్ అలీబేగ్, సర్వర్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు అమ్ముకుంటే అధోగతే



నయీంనగర్: డబ్బుకు ఓటు అమ్ముకుంటే ఐదేళ్ల పాటు భవిష్యత్ అధోగతి పాలవుతుందని, ఈక్రమంలో ధనస్వామ్యాన్ని బద్దలు కొట్టి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోక్‌నాథ్ సూచించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జైభారత్ జస్ట్ ఓట్ క్యాంపెయిన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సత్యనారాయణ గోల, జైభారత్ బీసీ పోరాట వేదిక సభ్యుడు సాంబశివరావుతో కలిసి 'డబ్బుకు ఓటు అమ్ముకుంటే బతికున్నా.. శవంతో సమానం' అనే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోక్‌నాథ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిపోయిన ఇలాంటి వికృత వ్యవస్థ కోసమా గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్ లాంటి మహనీయులు తమ జీవితాలను అర్పించింది అని ప్రశ్నించారు. సత్యనారాయణ గోల మాట్లాడుతూ నాయకులు పోస్తున్న మద్యానికి, పడేస్తున్న నోటుకు ఓటును అమ్ముకుంటున్నందుకు సిగ్గులేదా అని ఓటర్లను ప్రశ్నిస్తూ లక్షలాది పోస్టర్ల ద్వారా ఓటర్లను జైభారత్ జాగృతం చేస్తున్నట్లు వివరించారు.

వైన్స్‌కు అనుమతి ఇవ్వొద్దు

ఫోర్ట్‌రోడ్డుపై మహిళల ఆందోళన



ఖిలా వరంగల్: ఫోర్ట్‌రోడ్డులో షిర్డిసాయిబాబా గుడి సమీపంలో మద్యం షాపునకు ఎక్సైజ్‌శాఖ అనుమతి ఇవ్వొద్దంటూ రుద్రమాంబ నగర్ మహిళా సంఘం ప్రతినిధి జారతిదేవి డిమాండ్ చేశారు. జనావాసాల మధ్య వైన్స్ ఇచ్చిన అనుమతిని వెంటనే ఉపసంహరించుకోవాలని వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిలో ఫోర్ట్ రోడ్డు వద్ద మహిళా సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో స్థానిక మహిళలు సోమవారం ఆందోళన చేశారు. దాంతో రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. ఈక్రమంలో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనను విరమింపజేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో శ్రవంతి, లక్ష్మి, సమక్క, శైలజ, రాణి, సరస్వతి, మల్లమ్మ, నూతన్, అక్షిత్, వెంకట్, శ్రీలక్ష్మి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వాలు

వరంగల్: రాష్ట్రంలోని బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు రెండూ రైతు వ్యతిరేక ప్రభుత్వాలే అని, అందుకే ల్యాండ్ పూలింగ్ జీఓలను రద్దు చేయలేదని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబర్ల రాజన్న, మొగిళి ప్రతాపరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో రైతు వ్యతిరేక బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలని సూచించారు.

గత హామీలపై కేసీఆర్ జవాబు చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి



బూట్ పాలీష్ చేస్తూ ప్రచారం చేస్తున్న చర్మకారుల పరిరక్షణ కమిటీ బాధ్యులు

- ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ ఓటమి తథ్యం
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీదే విజయం
- పార్టీ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ: వరంగల్ మహానగర అభివృద్ధికి ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదో సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని, అమలు చేయనందునా నగరవాసులకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని విశాల్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయిని మాట్లాడుతూ 2014, డిసెంబర్ 29న వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్.. 73 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు, దానికి అనుబంధంగా రేడియల్ రోడ్లు, నగరంలో మూడుచోట్ల ఫ్లై ఓవర్లు నిర్మిస్తామని, విశాలమైన రోడ్లు, వడ్డెపల్లి చెరువు కట్టపై కాకతీయ మిషన్ పైలాన్ నిర్మాణం, జాతీయ స్థాయిలో కాకతీయ ఉత్సవాలు నిర్వహిస్తామని, పేదలకు 120 గజాల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అవేమీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. అలాగే, 2015, జనవరి 11న మరోసారి వరంగల్‌కు వచ్చి 8 మురికి వాడల్లో డబుల్‌బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పి శంకుస్థాపన చేసి ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఇల్లు పంపిణీ చేయలేదని ఎద్దేవాచేశారు. 2017, జనవరి 17న ఇంకోసారి వచ్చి గ్రేటర్ అభివృద్ధికి అథారిటీ ఏర్పాటు చేస్తామని, జక్కలొద్దిలో 250 ఎకరాల్లో థీం పార్కు ఏర్పాటు చేస్తామని, ఆధునిక మార్కెట్లు, విశాలమైన రోడ్లు, 50 వేల జనాభాకు కమ్యూనిటీ హాల్ పార్కులు, బస్‌బేలు నిర్మిస్తామని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ – వరంగల్ ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని, వరంగల్ నగర అభివృద్ధికి ఏడాదికి రూ.300 కోట్లు ఇస్తామని వాగ్దానం చేసి ఇన్నేళ్లైనా ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో విఫలమైనందుకు నగరవాసులకు సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్.. సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయించుకోలేని అసమర్థుడని ధ్వజమెత్తారు. ఓడిపోతాననే భయం వినయ్‌భాస్కర్‌కు పట్టుకుందని, దీంతో కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమిస్తున్న కార్యకర్తల తల్లిదండ్రులకు ఆయన అనుచరులు, ఆయన పెంచి పోషిస్తున్న రౌడీలు, గూండాలు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎన్నికల ఇన్‌చార్జ్‌లు రవీందర్ ఉత్తమ్‌రావు దళ్వీ, సంజయ్ జాగిర్దార్, నాయకులు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

పార్టీ హామీలను దైవసాక్షిగా అమలు చేస్తా..

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలతో పాటు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని ఆ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి ప్రతిజ్ఞ చేశారు. ఈమేరకు రూ.100 బాండ్ పేపర్‌పై అఫిడవిట్ తయారు చేసి దాన్ని హనుమకొండ పద్మాక్షికాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహం ముందుంచి ఆయన సోమవారం ప్రతిజ్ఞ చేశారు.

చర్మకారుల వినూత్న ప్రచారం

నాయిని రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ తెలంగాణ మాదిగ, చర్మకారుల, లెదర్ పరిశ్రమల భూముల (లిడ్ క్యాప్), దళిత అసైన్డ్ భూముల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వినూత్న ప్రచారం నిర్వహించారు. హనుమకొండ చౌరస్తాలో బూట్‌పాలీష్ చేస్తూ కాంగ్రెస్‌కు ఓటేయాలంటూ ప్రజలను అభ్యర్థించారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కూసపాటి శ్రీనివాస్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దేవరకొండ పద్మ, చంద్రగిరి శ్యామ్, నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాంత్, చంద్రగిరి రాజేష్, కుంటల విజయ, కుంటల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి



హన్మకొండ: దాస్యం వినయ్‌భాస్కర్‌ను సన్మానిస్తున్న మున్నూరు కాపులు



హన్మకొండ అర్బన్ ప్రచారంలో వినయ్‌భాస్కర్, అభినవ్‌భాస్కర్, నాయకులు

- బీఆర్ఎస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: తనను భారీ మెజారిటీతో మున్నూరు కాపులు గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ కోరారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని అభిరామ్ గార్డెన్‌లో మున్నూరు కాపుల కార్తీక మాసం వనభోజనాల కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయనను మున్నూరు కాపులు భారీ గజమాలతో సన్మానించారు.

60వ డివిజన్‌లో విస్తృత ప్రచారం

హన్మకొండ అర్బన్: దాస్యం వినయ్‌భాస్కర్ గెలుపు కోసం బీఆర్ఎస్ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. నగరంలోని 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి తెలంగాణ చౌరస్తా, సుబేదారి జంక్షన్, వడ్డెపల్లి చౌరస్తా, పోచమ్మ గుడి కూడళ్లలో డప్పు చప్పుళ్లు, కోలాటాల నడుమ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అరుణ శ్రవణ్‌కుమార్, డివిజన్ ఇన్‌చార్జ్ తండమల్ల వేణు, డివిజన్ ప్రెసిడెంట్ రాంరాజ్, 59వ డివిజన్ ప్రెసిడెంట్ నీలం సుహాస్, నాయకులు నీలం పావని పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గౌడల మద్దతు

కాజీపేట: గీత కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేయాలని గోపా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిర్ర రాజు అన్నారు. కాజీపేట మండలం సోమిడి గ్రామంలో సోమవారం జరిగిన గీత కార్మికుల విస్తృత స్థాయి సమావేశంలో గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్‌గౌడ్, వండ్లకొండ వేణుగోపాల్, గౌని సాంబయ్య, బస్వ యాదగిరి, మోడెం సురేందర్, పిల్లల సుధాకర్, శ్యామ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాజీపేట బిల్డింగ్ పెయింటింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గబ్బెట ఎల్లేష్, కనకం శివకుమార్ మద్దతు ప్రకటించారు.

వినయ్‌భాస్కర్ సతీమణి రేవతి ప్రచారం

కాజీపేట: బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌కు మద్దతుగా కాజీపేట పట్టణంలోని పలు కాలనీల్లో సోమవారం ఆయన సతీమణి రేవతి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

నయీంనగర్: నగరంలోని 54వ డివిజన్‌లో దాస్యం వినయ్‌భాస్కర్ సతీమణి దాస్యం రేవతి సోమవారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు మహిళలు బతుకమ్మ, బోనాలతో స్వాగతం పలికారు.

అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తా

- బీజేపీ వరంగల్ తూర్పు అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



కరీమాబాద్: మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కరీమాబాద్: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడుతానని బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 32వ డివిజన్ రామ్‌లక్ష్మణ్ గార్డెన్ ప్రాంతం, ఆకారపు వీరలక్ష్మి పాఠశాల, బీరన్నకుంట రోడ్, బీఆర్‌నగర్ ప్రాంతాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల పట్ల ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. ఈక్రమంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకు పోతోందని చెప్పారు. రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలన్నింటిలోనూ కేంద్ర ప్రభుత్వం వాటా ఉంటుందన్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని ప్రదీప్‌రావు చెప్పారు.

కమలం గుర్తుకు ఓటెయ్యండి

వరంగల్ చౌరస్తా: ఉపాధి, సంక్షేమం, రక్షణకు బీజేపీ కమలం గుర్తుకు ఓటెయ్యాలని పార్టీ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు విజ్ఞప్తి చేశారు. వరంగల్ 26వ డివిజన్‌లోని వివేకానంద కళాశాల, మార్కెట్ బొడ్రాయి, గౌడవాడ, లక్ష్మీపురం స్కూల్, రజక వీధి, మైసమ్మవీధి, రమవారి వీధి, చార్‌బౌళి ప్రాంతాల్లో సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటమి భయం పట్టుకుందని ఆరోపించారు. తనను గెలిపిస్తే నిత్యం జనం మధ్యలో ఉంటూ ప్రజాసేవకే అంకితమవుతానని ప్రదీప్‌రావు హామీ ఇచ్చారు.

ప్రదీప్‌రావు సతీమణి ప్రచారం

కరీమాబాద్: గ్రేటర్ పరిధిలోని 32వ డివిజన్ బీఆర్ నగర్‌లో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సతీమణి రేణుక ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రదీప్‌రావుకు ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు.

బీజేపీలో పలువురి చేరిక

కాశిబుగ్గ: ఓసిటీలోని క్యాంపు కార్యాలయంలో గోదల అనిల్ ఆధ్వర్యంలో 26 డివిజన్ యువ తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్‌కు చెందిన ఆటోడ్రైవర్లు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ప్రదీప్‌రావు ఆహ్వానించారు.

స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయాలి

విద్యారణ్యపురి: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని, అలాగే పోలింగ్ జరిగిన మరుసటి రోజు డిసెంబర్ 1న స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.సదాశివరెడ్డి, హనుమకొండ జిల్లా జనరల్ సెక్రటరీ పెండెం రాజు, సంఘం బాధ్యులు కోరారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ కల్పించాలి

కరీమాబాద్: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులందరికి పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించాలని, పోలింగ్ తర్వాత రోజు క్యాజువల్ లీవ్ ఇవ్వాలని కోరారు. ఈమేరకు టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో విధుల్లో ఉన్నవారిలో కొంతమందికి ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటికాయల కుమార్, సుజన్‌ప్రసాద్, రవూఫ్, వెంకటేశ్వర్‌రావు, రేణుక, రజిత, దామోదర్, సత్యనారాయణ, నీలాద్రి, మల్సూర్, సీతారాం పాల్గొన్నారు.

పద్మాక్షి దేవాలయంలో దీపోత్సవం



కాశిబుగ్గ: కాశీ విశ్వేశ్వరాలయంలో..



భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు



కాజీపేట ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఖిలా వరంగల్: అనఘాష్టమి వ్రతంలో మహిళలు

హన్మకొండ కల్చరల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నగరంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. హనుమకొండలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో అర్చకుడు నాగిళ్ల శంకరశర్మ, షణ్ముక పద్మనాభ అవధాని.. చంద్రమౌళీశ్వర స్వామికి రుద్రాభిషేకం, హోమం, సామూహిక దీపోత్సవం నిర్వహించారు. భద్రకాళి రోడ్డులోని ధర్మశాస్త అయ్యప్ప భక్త సేవాశ్రమంలో అయ్యప్పకు పూజలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు, గురుస్వామి టీఆర్.సుబ్రమణ్యశర్మ ఆధ్వర్యంలో అర్చకుడు గణపతిశర్మ సుప్రభాతసేవ, విశేషద్రవ్య అభిషేకాలు, మహా మంగళ కర్పూర నీరాజనం జరిపారు.

కాశిబుగ్గలో..

కాశిబుగ్గ: కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో జ్వాలాతోరణం వెలిగించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ స్వామి, లేబర్‌కాలనీలోని పంచముఖ నాగ వీరేశ్వరాలయంలో పూజలు చేశారు.

కాజీపేట మల్లన్న ఆలయంలో..

కాజీపేట: కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయ ఆవరణలో ఆలయ ప్రధాన పూజారి అయినవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు పూజలు చేశారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అలంకరణ, మల్లికార్జునుడికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టు సభ్యులు, శివ – శక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో సోమవారానికి ఎంతో ప్రాధాన్యం ఉందని శ్వేతార్క ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ తెలిపారు. కాజీపేట పట్టణంలోని శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రం ఆవరణలో సోమవారం కార్తీక దీప, ఆకాశదీప పూజల విశేషాలను భక్తులకు వివరించారు. పూజా కార్యక్రమంలో గంగుల రాజిరెడ్డి, శనిగరపు రాజ్‌మోహన్, దేవులపల్లి సదానందం, కాగితాల సారంగపాణి, తుమ్మ శ్రీనివాస్, వీరేందర్, రాజ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అనఘాష్టమి వ్రతం

ఖిలా వరంగల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో అనఘాష్టమి వ్రతాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి శివరామకృష్ణ చార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మంచాల కృష్ణమూర్తి, శ్రీరాం రాజేష్, రావికంటి అశోక్, ఆడెపు శ్యాంసుందర్, యాదగిరి, శైలజ, రావికంటి శ్రీదేవి, మంచాల రాణి, కృష్ణవేణి, రాధిక పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి



భట్టుపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



మామునూరు: నక్కలపెల్లిలో..

మడికొండ: ఓటు హక్కును ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు సూచించారు. మడికొండ పోలీసుస్టేషన్ పరిధిలోని భట్టుపల్లి, కొత్తపల్లి, టేకులగూడెం గ్రామాల్లో పోలీసులు సోమవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మడికొండ ఎస్సైలు జక్కుల రాజబాబు, దివ్య, బీఎస్ఎఫ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలను కాపాడాలి

మామునూరు: ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సమస్యాత్మక గ్రామాల్లో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఏసీపీ సతీష్ ఆదేశాల మేరకు ఖిలా వరంగల్ మండలం నక్కలపెల్లి, జక్కలొద్ది గ్రామాల్లో ఎస్సైలు కృష్ణవేణి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు సోమవారం ఉదయం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి



పర్వతగిరి: ప్రచారం చేస్తున్న అరూరి రమేశ్



పర్వతగిరి: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రమేశ్

- పార్టీ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేశ్

పర్వతగిరి : బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాయని బీఆర్ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. ఈ మేరకు పర్వతగిరిలో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పార్టీ కార్యకర్తలు, మహిళలు డప్పు చప్పుళ్లు, కోలాటాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకు మరింత లబ్ధి చేకూరే విధంగా ఎన్నికల మేనిఫెస్టో రూపొందించారని, దీంతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని, ప్రజల ఆశీర్వాదం కోరుతున్నట్లు తెలిపారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో ప్రతి గ్రామంలో ప్రతీ ఇంటికి ఏదో ఒక సంక్షేమ ఫలం అందుతుందని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అవగాహన రాహిత్యంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కనబడటం లేదా అని ప్రశ్నించారు. తాము చేసిన పనులు కాంగ్రెస్ వచ్చిన తర్వాత చేస్తామని చెప్పడం వారికే చెల్లిందన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ఎత్తులు వేసిన చివరికి వర్ధన్నపేట నియోజకవర్గంలో ఎగిరేది గులాబీ జెండా మాత్రమేనని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి చేసిన కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: పూజలు చేస్తున్న గౌడ సంఘం సభ్యులు



వర్ధన్నపేట: మాట్లాడుతున్న కుమారస్వామి

అరూరి గెలుపునకు కృషి చేయాలి

బీఆర్ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ సర్పంచ్ జడల పద్మకృష్ణ కోరారు. ఈ మేరకు మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో మహిళలతో కలిసి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

ఓట్లన్నీ బీఆర్ఎస్‌కే..

హసన్‌పర్తి : గంపగుత్తగా ఓట్లన్నీ బీఆర్ఎస్ పార్టీకే వేయాలని గౌడ జేఏసీ హనుమకొండ జిల్లా కన్వీనర్ చిర్ర రాజు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోరుతూ హసన్‌పర్తి మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్‌తో కలిసి చిర్ర రాజు మాట్లాడారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ఉన్న గౌడ కులస్తుల ఓట్లన్నీ అరూరి రమేశ్‌కు వేయనున్నట్లు చెప్పారు. వైన్స్ షాపుల టెండర్‌ల్లో 15శాతం రిజర్వేషన్ కల్పించినట్లు బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘాల జేఏసీ అడ్వైజర్ వడ్లకొండ వేణుగోపాల్, జేఏసీ జిల్లా నాకులు అటికం రవీందర్, దేశిని రవీందర్, ఏరుకొండ రమేష్, వల్లాల గణేష్, వల్లాల యాదగిరి, వల్లాల గంగాధర్, దొనికెల సారంగపాణి, బొనగాని రఘు, బూర శ్రీధర్, సాంబయ్య, మడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరూరి రమేశ్‌కు డీఎస్ఎస్ఎస్ మద్దతు

వర్ధన్నపేట : అరూరి రమేశ్‌కు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లను పెంచుతూ అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసిన బీఆర్ఎస్‌నే దళితులు గెలిపించాలని పిలుపునిచ్చారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, సచివాలయానికి అంబేడ్కర్ నామకరణం చేయడం, దళితులకు రూ.10 లక్షల ఆర్థికసాయం అందించడం, వంటి సంక్షేమ ఫలాలు అందించిన బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన అరూరిని భారీ మెజారిటీతో గెలిపించాలని వేడుకున్నారు.